క్లుప్తంగా

చెక్కులు పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే రేగా కాంతారావు సిఫారసు మేరకు డి.కొత్తగూడెం గ్రామానికి చెందిన కారం నాగేశ్వరరావుకు రూ.60,000 వేలు, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కందుల వెంకటరెడ్డి రూ.46 వేల విలువచేసే చెక్కులను వైద్య ఖర్చులు నిమిత్తమై మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, ఎంపీటీసీ మడకం రామారావు, నాయకులు కణితి రాముడు, జానీపాషా, తునికి కామేష్, దామెర్ల శ్రీనివాసరావు, మొత్కురి శ్రీకాంత్, పొడుతూరి నాగరాజు, సర్పంచ్ వాగే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొదుపుపై వడ్డీరేట్లు పెంపు

చండ్రుగొండ: ఈ ఏడాది జనవరి నుంచి మార్చి నెలవరకు అన్ని రకాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లు పెంచారని, ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ అసిస్టెంట్ సూపరింటెండ్ రంజిత్‌కుమార్ చౌదరి తెలిపారు. మండలకేంద్రం చండ్రుగొండలోని సబ్‌పోస్టాఫీసును శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 30 వరకు గ్రామాల్లో మేళాలు ఏర్పాటు చేసి తపాల సేవలపై ప్రచారం నిర్వహిస్తామన్నారు. స్థానిక పోస్టల్ అధికారులు సత్యనారాయణ, నాగరాజు, సురేష్, సిబ్బంది శెట్టిపల్లి శ్రీనివాస్, నిహారిక, పురుశోత్తం, వెంకటేశ్వర్లు, ఎండి.ఫయాజ్‌హుసేన్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం సబ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలో శనివారం నుంచి మూడు రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నట్లు భద్రాచలం నార్త్ సబ్ డివిజన్ ఏఎస్పీ సచేంద్ర తెలిపారు. స్థానిక సబ్ పోస్ట్ ఆఫీస్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. వడ్డీ రేట్లు పెంపుపై అవగాహన కల్పించేందుకు మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉద్యోగులు ఎంఎస్‌వీ.రావు, పి.ఆనంద గోపాల్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ

మణుగూరురూరల్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తన క్యాంప్ కార్యాలయంలో క్రీడాకారులకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. వీటిని అందజేసిన పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. మణుగూరు వైఎస్ ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్‌లు గోరంట్ల కనకయ్య, ఎస్‌కె బాజీ, పాతూరి వెంకన్న, దొడ్డపనేని మధు, ఎస్‌కె అబ్దుల్లా, పూనెం చంద్రశేఖర్, వేములపల్లి శ్రీనివాసరావు, బాబురావు, పానగంటి రవి, పాల్వంచ సుజాత పాల్గొన్నారు.

పొంగులేటి పర్యటన



సర్పంచ్ కుమారుడిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అశ్వారావుపేటరూరల్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం అశ్వారావుపేట మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండల పరిధిలోని నారంవారిగూడెం కాలనీ వద్ద కొత్తగా నిర్మించిన ముత్యాలమ్మ తల్లి ఆలయానికి వెళ్లగా, భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే వినాయకపురం గ్రామంలో ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనతంరం ఊసిర్లగూడెం గ్రామంలో సర్పంచ్ మొడియం నాగమణి కుమారుడిని పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమాల్లో మాజీ డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, నియోజకవర్గ నాయకులు జారే ఆదినారాయణ, సర్పంచ్ నారం రాధా, ఉప సర్పంచ్‌లు రేమళ్ల కేధార్ నాథ్, గేదల సురేష్ నాయుడు, నాయకులు జూపల్లి ప్రమోద్, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ఉత్తములకు సన్మానం

అన్నపురెడ్డిపల్లి: 108 అంబులెన్స్ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించి జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తమ అవార్డు పొందిన ఈఎంటీ కనపర్తి కళాధర్‌ను శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బోడా పద్మ శాలువా కప్పి సన్మానించారు. తొలిత కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు పెద్దారపు నాగరాజు ఆధ్వర్యంలోను ఈఎంటీకి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పర్సా వెంకటేశ్వర్లు, సెక్రటరీ ఖాదర్, దారావత్ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎంపీఓగా సీతారామరాజు, ఈఓగా గజవెల్లి హరికృష్ణ ఎంపిక కావడం, ఆ మేరకు అవార్డులు పొందడంపై గ్రామ పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది మట్లకుంట్ల కామేశ్వరరావు, మూల అప్పన్న, ఆరేపల్లి నాగేంద్ర, మురళీకృష్ణ, సుబ్రమణ్యం, రాజపుత్ర రంజిత్ సింగ్, కేసుపాక నరసింహారావు, ముసికి నాగేశ్వరరావు, మద్దాల విజయ్‌కుమార్, పిట్టల దేవి, బంధం మహాలక్ష్మి ఉన్నారు.

పొట్టకూటి కోసం.. రాష్ట్రం దాటి..

- ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న ఆదివాసీలు
- అక్కడ పనులు లేకపోవడంతో వలస
- ఇక్కడి మిర్చి కోతలతో ఉపాధి
- తక్కువ కూలికి మధ్యవర్తుల బేరసారాలు



చర్ల బస్టాండ్ ఆవరణలో ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ కూలీలు

చర్ల: బతుకుదెరువు కోసం సరిహద్దు ఆదివాసీలు తెలంగాణాలోకి భారీగా వలస వస్తున్నారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ పల్లెల్లో ఎటువంటి పనులూ లేకపోవడంతో అక్కడి ఆదివాసీలు తెలంగాణాలో ప్రారంభమైన మిర్చి కోత పనులకు వస్తున్నారు. జనవరి నుంచి ఏప్రిల్ వరకు ఐదు నెలల పాటు కొనసాగే మిర్చి కోత పనుల కోసం ఆదివాసీలు వృద్ధులు, మహిళలు, పిల్లలతో కలిసి వలసొస్తున్నారు. ఇక్కడి పనులతో వచ్చే డబ్బుతో వారికి వర్షాకాలం మొత్తానికి అవసరమయ్యే బియ్యం, నూకలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుని వెళ్తారు.

ఏటా నాలుగు వేల మంది వరకు..

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఆదివాసీ గ్రామాల్లో పనులు లేకపోవడంతో ఏటా మూడు నుంచి నాలుగు వేల మంది ఆదివాసీలు తెలంగాణాకు వలసొస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏటాది కూడా వలసలు ఆరంభమయ్యాయి. అయితే గతం కంటే ఈ ఏడాది వలస వస్తున్న వారి సంఖ్య పెరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో ప్రస్తుతం ఎటువంటి పనులు లేకపోవడంతోపాటు ఉపాధిహామీ పనులు చేసుకోడానికి బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాలు లేవు. ఒకవేళ ఉన్నా ఆయా ఆఫీసులు వారి గ్రామాలకు అందుబాటులో లేకుండా ఉన్నాయి. దీంతో సరిహద్దున ఉన్న మూడు జిల్లాల్లోని అటవీ ప్రాంతాలకు చెందిన ఆదివాసీలకు వలసలే శరణ్యమయ్యాయి. అందులో భాగంగా తెలంగాణలో ఉన్న అవకాశాలను వినియోగించుకుంటున్నారు.

బీడుబోయిన పల్లెలు..

కూలీ పనుల కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని తెలంగాణాలోకి ఆదివాసీలు భారీగా వసలొస్తుండడంతో ఆ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల్లోని ఆదివాసీ పల్లెలు ఖాళీ అవుతున్నాయి. గతంలో మావోయిస్టులు, సాల్వాజుడం భయంతో గ్రామాలను ఖాళీ చేస్తూ వచ్చిన ఆదివాసీలు ఇప్పుడు కలీ పనుల కోసం బయటకు వస్తూ గ్రామాలను ఖాళీ చేస్తున్నారు. ఇళ్ల నుంచి కదలలేని వృద్ధులు తప్పా అక్కడ ఎవరూ లేరు. దీంతో ఆయా గ్రామాలన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. కాగా, వలస వచ్చిన ఛత్తీస్‌గఢ్ వాసులతో తెలంగాణ సరిహద్దు పల్లెల్లో సందడి వాతావరణం కనిపిస్తోంది. వారి రాకపోకలతో జన సంచారం కళకళలాడుతోంది.

శ్రమ దోపిడీకి దళారీల యత్నాలు..

బతుకుదెరువు కోసం భారీగా వలసొస్తున్న ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు దళారీలు వారి శ్రమను దోచుకునేందుకు యత్నిస్తున్నారు. పనుల కోసం తరలివస్తున్న ఆదివాసీలకు ఎదురేగి సరిహద్దు గ్రామాలకు చేరి.. కూలి ధర రెండొందలు ఇస్తామని, రెండొందల యాభై ఇస్తామని చెబుతూ పనులకు తీసుకెళ్తున్నారు. వారిని రైతులకు అప్పగించి ఒక్కో మనిషికి రూ.500 నుంచి రూ.600 చొప్పున రైతుల నుంచి వసూలు చేస్తున్నారు.

రూ.200కు ఏమొస్తాయి..?



రెండొందల రూపాయలకు ఏం వస్తాయి. రెండొందలు, రెండొందల యాభై ఇస్తామని అంటున్నారు. మిర్చి తోటల వద్దనే ఉంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేసే మాకు చాలీ చాలని కూలీ ఇస్తామనడం సరికాదు. కనీసం నాలుగు వందల రూపాయలైనా ఇస్తే బాగుండు.

– వంజం దేవా, ఉదతమల్ల

అవసరాన్ని ఆసరాగా చేసుకుంటే ఎలా..



అవసరాన్ని ఆసరాగా చేసుకోవడం సరైంది కాదు. పనులు లేక ఇక్కడికి వస్తుంటే బేరసారాలు ఆడడం, చాలీ చాలని కూలీ డబ్బులు ఇస్తామనడం మంచిగ లేదు. మా ఆకలి బాధలను కూడా అర్థం చేసుకోవాలి. కనీసం నాలుగు వందలైనా కూలీ ఇవ్వాలి.

– వెట్టి మంగి, తెట్టెమడుగు

'దళితబంధు' అద్భుత పథకం



దళితబంధు పథకం లబ్ధిదారుడికి కారును అందిస్తున్న ప్రభుత్వ విప్ రేగా, జెడ్పీటీసీ శ్రీలత

బూర్గంపాడు: దళితుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు దేశచరిత్రలోనే అద్భుత పథకమని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మండలంలో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించి రూ.1.25 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన తోకల రమణకు దళితబంధు పథకంలో షిఫ్ట్ డిజైర్ కారును ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నిరంగాల్లో వెనుకబాటుకు గురైన దళితుల సంక్షేమాని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం కేసీఆర్ కంకణబద్ధులై పనిచేస్తున్నారన్నారు. పినపాక నియోజకవర్గానికి స్పెషల్ డెవలప్‌మెంట్ కోసం రూ.100 కోట్ల సీఎం మంజూరు చేశారన్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికబద్ధంగా పనిచేస్తున్నామన్నారు. ఆయా కార్యక్రమాలలో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, రైతుబంధు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ బిజ్జం శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎంపీఓ సునీల్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా 'వాయిస్ ఫర్ గర్ల్స్'

దమ్మపేట: మండల పరిధిలోని దుర్గం గొల్లగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏటీడీఓ చంద్రమోహన్ హాజరయ్యారు. నియోజకవర్గ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల నుంచి 384 మంది బాలికలతో పాటుగా మహిళ హెచ్ఎంలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళ ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. మహిళ సాధికారత సాధించే దిశగా బాలికలు విద్యార్థి దశ నుండే సంసిద్ధులు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం.విజయలక్ష్మి, డిప్యూటీ వార్డెన్ నాగమణి, తదితర పాఠశాలల హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో..

దుమ్ముగూడెం: మండల పరిధిలోని లక్ష్మీనగరం గ్రామంలోని కే రేగుబల్లి, గౌరారం బాలికల ఆశ్రమ పాఠశాలలో భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో శుక్రవారం వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భద్రాచలం ఐటీడీఏ జీసీడీఓ అలివేలు మంగమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు చెందిన పరిచయ సంస్థ నిర్వాహకులు ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న బాలికలకు పది రోజులపాటు నేటి సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఏటీడీఓ నరసింహారావు, ప్రధానోపాధ్యాయురాలు ధనసరి నాగమణి, సుజాత, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు మంజూరు చేయాలి

భద్రాచలంఅర్బన్: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని, నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. పార్టీ భద్రాచలం పట్టణ కమిటీ సమావేశం మర్లపాటి రేణుక అధ్యక్షతన శుక్రవారం పట్టణంలో జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ సర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.రేణుక, సున్నం గంగ, పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, ఎస్.లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు డి.సీతాలక్ష్మి, బి.కుసుమ, యు.జ్యోతి, జీవనజ్యోతి, నాగరాజు, ఫిరోజ్, లక్ష్మీకాంత్, సీహెచ్.శ్రీనివాస్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

భద్రాచలంఅర్బన్: సమాజ సేవలో తమ వంతు బాధ్యతగా పట్టణంలోని 'చేతన మీసేవ'భాగస్వామ్యం కావడం అభినందనీయమని ఏఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. దరఖాస్తులు, ఇతర నియమావలి సూక్తులను చేతన మీవ నిర్వహకుడు రంజిత్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం భద్రాచలం ఏఎస్పీ రోహిత్ రాజ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ భద్రాద్రి పోలీస్ శాఖ బృహత్తర కార్యక్రమాల్లో మీసేవ నిర్వహకులు తమవంతు బాధ్యతను నిర్వర్తించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కల్యాణి మీసేవ నిర్వాహకులు చెరుకూరి మల్లికార్జునరావు, మహేష్, శీలం రామ్మోహన్ రెడ్డిలు పాల్గొన్నారు.

ఏఎస్పీకి సన్మానం

భద్రాచలం ఏఎస్పీగా విధులు నిర్వహించి హైదరాబాద్ గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా బదిలీ అయి వెళ్తున్న రోహిత్ రాజ్‌ను శుక్రవారం పట్టణానికి చెందిన అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి పూసం రవికుమారి శాలువాతో ఘనంగా సన్మానించారు. రానున్న కాలంలో ఆయన ఉన్నతమైన పదువులను పొందాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లుగా రవికుమారి తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు

అశ్వాపురం: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు అన్నారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో వరుస దొంగతనాలు జరుగుతండటంతో శుక్రవారం గ్రామంలో పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మర్రి మల్లారెడ్డి అధ్యక్షతన ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో గ్రామ రక్షణ కమిటీలు అవసరమని, మొండికుంట గ్రామంలో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సదస్సులో సీఐ శ్రీనివాసరావు, ఎస్సై జితేందర్, సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఎంపీటీసీ కమటం నరేష్, ఉపసర్పంచ్ సుధీర్, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కమటం వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల సబ్ స్టేషన్ దగ్గర ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా శుక్రవారం సర్పంచ్ తెల్లం వరలక్ష్మి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సూరిబాబు, ఉపాధ్యక్షుడు బిలాపాటి రాజు, సెక్రటరీ వంద వాసు రామ వరప్రసాదరావు, ట్రెజరర్ ముక్కెర రాంబాబు, కార్యవర్గ సభ్యులు నిట్ట అబ్రహం, కోడి భద్రం, పూణెం సురేష్, హరికృష్ణ,గౌరారపు సాంబ, గోసంగి కిరణ్ మోహన్, జి.రాపర్తి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

భద్రాచలంటౌన్: పట్టనంలోని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎలక్ట్రీషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ యూనియన్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కొండల్ రెడ్డి పాల్గొని ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ యూనియన్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుక్కా సుధాకర్, తిరుపతిరావు, రత్నం రమాకాంత్, ఎండీ నవాబ్, రాజీవ్, ప్రమోద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతను పెంచే పదోన్నతులు..



ఆపరేటర్లకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

మణుగూరుటౌన్: పదోన్నతి కర్తవ్య నిర్వాహణ బాధ్యతను మరింత పెంచుతుందని ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మణుగూరు ఏరియాలోని పీకేఓసీ–2 బేస్ వర్క్‌షాపులో కొత్తగూడెం రీజియన్ స్థాయి విధులు నిర్వహిస్తున్న అర్హత కలిగిన ఏగ్రేడ్ ఈపీ ఆపరేటర్స్, అంతర్గత స్పెషల్ గ్రేడ్ ఈపీ ఆపరేటర్స్‌కు పదోన్నతి ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగూడెం రీజియన్ స్థాయిలో మణుగూరు, సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాల్లో పనిచేస్తున్న మూడు సంవత్సరాల సర్వీస్ పూర్తిచేసి దరఖాస్తు చేసుకున్న ఏగ్రేడ్ ఆపరేటర్లకు ఈ ఇంటర్వ్యూలో మౌఖిక, రాత, ప్రాక్టికల్స్ టెస్టులు నిర్వహించామన్నారు. ప్రమాదాల నివారణ, ఆధునిక పరిజ్ఞానం వంటి అంశాల్లో ఆపరేటర్లు ఎంతమేరకు అవగాహన కలిగి ఉన్నారు అనే గీటురాయిగా ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొత్తం 23 మంది అభ్యర్థులకుగాను 22మంది టెస్టులకు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్, ప్రాజెక్టు ఇంజనీర్ పీకేఓసీ జె.వీరభద్రుడు, డీజీఎం పర్సనల్ కార్పొరేట్ కె.అజయ్‌కుమార్, ఎస్ఈ దాసరి రాజశేఖర్, సీహెచ్.వెంకటేశ్వర్లు, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ రాజు, శిక్షకుడు సీహెచ్ వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

కార్మికులకు జీవనోపాధి కల్పించాలి

దమ్మపేట: వ్యవసాయ కార్మికుల జీవనానికి అవసరమైన ఉపాధి పనులు కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి అమర్లపూడి రాము, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కోల్పోయిన వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వాలే ఉపాధి కల్పించాలని కోరుతూ తహసీల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తహసీల్దార్ స్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అమర్లపూడి రాము మాట్లాడారు. నాయకులు కుర్సం ముత్యాలరావు, కుంజ కాంతారావు, తాటి సత్యం, దుర్గమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

దమ్మపేట: గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మండల పరిధిలోని పంచాయతీ కార్మికులు తాటిసుబ్బన్నగూడెం గ్రామంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. కార్మికుల వేతనాలను పెంచి, ఆరోగ్య భద్రతను కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే సెలవులను పంచాయతీ కార్మికులకు కూడా వర్తింపజేయాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పందేటి చెన్నారావు, రాంబాబు, జేమ్స్, ప్రభాకర్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనకు ఏర్పాట్లు

అశ్వాపురం: మండల పరిధిలోని బీజీకొత్తూరు గ్రామంలో సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌కు అనుబంధంగా ఆయకట్టుకు నీరు అందించేందుకు సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్– అదనపు ఆయకట్టు పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టనున్నారు. దీనికి సంబంధించి శంకుస్థాపన కార్యక్రమానికి శుక్రవారం డీఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.25 కోట్లతో నిర్మించనున్న పంప్‌హౌస్ నిర్మాణ పనులకు ఈ నెల 29న ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు శంకుస్థాపన చేయనున్నారు. డీఈ శ్రీనివాస్ శంకుస్థాపన పైలాన్‌ను, ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

17 వేల ఎకరాలకు నీరు..

పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక కృషితో తెలంగాణ ప్రభుత్వం మండల పరిధిలోని బీజీ కొత్తూరులోని సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌కు అనుబంధంగా నూతనంగా నిర్మిస్తున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలో 17 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శంకుస్థాపన కార్యక్రమానికి మండలంలోని రైతాంగం పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్ కుమార్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ గజ్జల లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ ఏనిక రవి, సర్పంచ్ సున్నం రాంబాబు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి

గుండాల: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు పరీక్షలంటే భయం పోగొట్టుకోవాలని ఎంఈఓ కృష్ణయ్య అన్నారు. మండలంలోని హైస్కూల్ నందు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టిన పరీక్ష పే కార్యక్రమాన్ని ఢిల్లీ నుంచి ప్రసారం చేసిన లైవ్ వీడియోను విద్యార్థులు, ఉపాధ్యాయులు వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు సోలం సతీష్, హెచ్ఎం కిషన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తనిఖీ

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని రైతువేదికలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని మండల అధికారులు శుక్రవారం సందర్శించారు. స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, ఎంపీడీఓ అన్నపూర్ణ రోగులతో మాట్లాడారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్లు బి.రఘునంద, సాయిబాబు, ఎంపీఓ తులసీరాం, సెక్రటరీ ఉపేందర్, హెచ్‌వీ యండి.ఇమాం పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: భద్రాద్రిలో ఫిబ్రవరి 5 నుంచి 7 వరకు నిర్వహించే 21వ అంతర్ రాష్ట్ర స్థాయి నాటకోత్సవ సాంస్కృతిక సంబరాల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. పట్టణంలోని జీయర్ మఠంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సోమరౌతు శ్రీనివాస్, శివ శంకర్ నాయుడు, వంశీకృష్ణ, సూర్యనారాయణ, భూపతిరావు, శ్రీనివాసరావు, వెంకటాచారి, హరిచంద్ర నాయక్, నాగేశ్వరరావు, నరసింహారావు, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

భద్రాచలంటౌన్: పట్టణంలోని శ్రీకృష్ణ దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన యాదవ సంఘం పట్టణ కమిటీని జిల్లా కార్యదర్శి వల్లపు యాకయ్య ప్రకటించారు. పట్టణ అధ్యక్షుడిగా జెట్టి రామకృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కాటిబోయిన ఆనంద్‌కుమార్, ఉపాధ్యక్షులుగా నక్క సాయిరాం, గోసుల శ్రీనివాస్, కోశాధికారిగా కనకరాజు యాదవ్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కోదాడ శ్రీనివాసరావు, గల్లా నాగభూషణం, కాశీబోయిన ఉపేందర్, గాలి అచ్యుతరావు, గోనే రమేష్, గోనే సుధాకర్, గుండెబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మంచిని పెంచుదాం..

చండ్రుగొండ: సమాజంలో మంచిని పెంచేందుకు కులమతాలకు అతీతంగా భాగస్వాములు కావాలని జమాతే ఇస్లామిహింద్ జాతీయ నాయకులు మహ్మద్ అబ్దుల్ బాసిత్ పిలుపునిచ్చారు. మండలకేంద్రం చండ్రుగొండలో శుక్రవారం రాత్రి జేఐహెచ్ ఆధ్వర్యంలో కుల మతాలకు అతీతంగా సభ నిర్వహించారు. ఈ సభలో బాసిత్ మాట్లాడారు. మండలశాఖ అధ్యక్షులు యండి.షబ్బీర్‌హుసేన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జేఐహెచ్ జాతీయ నాయకులు యండి.ఇఫ్తేఖార్, జిల్లా అధ్యక్షుడు యండి.ఫారుఖ్, యండి.ఖాజాహుసేన్ మాట్లాడారు. కార్యక్రమంలో రైతుసమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, వైఎస్ ఎంపీపీ నల్లమోతు సత్యనారాయణ, ఎస్డీ రసూల్, భోజ్యానాయక్, యండి.సాబీర్‌హుసేన్, సీపీఎం నాయకులు ఐలూరి రామిరెడ్డి, యాస నరేష్, వేణులతోపాటు వివిధ పార్టీల నాయకులు, జేఐహెచ్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడారంగానికి ప్రాధాన్యత ఇస్తున్నాం



ద్వితీయ స్థానం పొందిన క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ బిచ్చన్న

మణుగూరుటౌన్: క్రీడాకారులకు జెన్‌కో సంస్థ మరింత ప్రాధాన్యత ఇస్తుందని బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న అన్నారు. శుక్రవారం మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ క్రీడాకారులు హైదరాబాద్‌లో జరిగిన టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్టు వాలీబాల్ పోటీల్లో ద్వితియస్థానం పొందిన సందర్భంగా వారిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ ఉద్యోగులు తొలి ప్రయత్నంలోనే ద్వితీయ స్థానం పొంది అవార్డు అందుకు రావడం సంతోషించాల్సిన విషయం అన్నారు. క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఆటలతోపాటు ఉద్యోగ బాధ్యతలను క్రమశిక్షణ, అంకిత భావంతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ అడ్మిన్ బి.పార్వతి, స్పోర్ట్స్ సెక్రటరీ కెప్టెన్ కల్తి నర్సింహారావు, కోశాధికారి సీహెచ్ సాయిప్రసాద్, జట్టు మేనేజర్ ఎం.నాగేశ్వరరావు, సభ్యులు కె.చిట్టిబాబు, డి.రమేష్, కె.కృష్ణకుమార్, కె.రంగారావు, ఎస్.నర్సింహారావు, పి.తిరుపతయ్య, పి.భరత్, కె.మధు, జి.సంపత్‌లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



బూర్గంపాడు: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

అశ్వారావుపేట: సీఎం కేసీఆర్ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పద్మ డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్షణమే ఉద్యోగ భద్రత, పెన్షన్, కనీస వేతనం, ఈఎస్ఐ కల్పించాలని కోరారు. నాయకులు పిట్టల అర్జున్, కృష్ణవేణి, కర్నాటి రాధా, కనకమహాలక్ష్మి, ప్రభావతి, సరోజిని, శాంతకుమారి, శ్యామల, లావణ్య, తాటి లక్ష్మి పాల్గొన్నారు.

బూర్గంపాడు: గత 40 ఏళ్లుగా ఐసీడీఎస్‌లో సేవలను అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల అధ్యక్షులు బర్ల తిరుపతయ్య డిమాండ్ చేశారు. మోరంపల్లిబంజరలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గద్దల శ్రీనివాస్, బత్తుల వెంకటేశ్వర్లు, అనసూయ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యలక్ష్మి పథకం కింద అందిస్తున్న భోజనానికి తల్లులకు మెనూ చార్జి రోజుకు పది రూపాయలకు పెంచాలని, పిల్లలకు ఐదు రూపాయలకు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దుమ్ముగూడెం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సీడీపీఓ సలోమికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ కొరసా చిలకమ్మ, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు కమలాదేవి, బుచ్చమ్మ, గజలక్ష్మి కృష్ణవేణి, రమణ, సృజన, రాజేశ్వరి, విజయలక్ష్మి, కాంత, బేబీ పాల్గొన్నారు.